



# మన రచయిత/త్రులు

## మద్దూరి రాజ్యశ్రీ

*'మన రచయిత/త్రులు' పేరిట శ్రీమతి రాజ్యశ్రీ ఒక్కొక్క రచయిత / రచయిత్రిని విశ్లేషిస్తూ, వాళ్ళ నవల నొకదానికి సమీక్ష రాస్తారు. శ్రీమతి రాజ్యశ్రీ ఎమెస్కో అధినేత శ్రీ యం.యస్.రావుగారి అమ్మాయి. ఆమె 200 పైగా నవలలకు ఎడిటోరియల్ వర్కు చేశారు. రీడర్స్ రిపోర్టు రాయటం, బాక్ కవరు మేటర్ రాయటం, పుస్తక ప్రపంచంలో రాబోయే నవలకు సమీక్ష రాయటం చేశారు. ఆ అనుభవంతో ఇప్పుడు మన కౌముది ద్వారా మీ ముందుకు వస్తున్నారు.*

## మాలతీ చందూర్ - స్త్రీ మనో వికాస వీచికలు

*ఆ నూట అరవై రోజులలో తానెంత మానసిక క్షోభపడింది! తనని తాను అదుపులో పెట్టుకోవటానికి ఎంత సాధన చేసింది! పుస్తకాల మీద మనసు నిలుపుదామనుకుంది. ఓడిపోయింది భగవంతుని మీద నమ్మకం లేని తను భగవంతుని మీద మనసు లగ్నం చేద్దామని ప్రయత్నించి విఫలురాలయింది. పరుగెత్తే ఈ మనసుని పట్టుకునేందుకు స్తంభించి నిలిచిపోయిన కాలాన్ని కదిల్చేందుకు తానెంత సాధన చేసింది!*

'మనదేశంలో చాలా మంది స్త్రీలు సగటు ఆడవారు నువ్వెదుర్కున్న సమస్యలనే ఎదుర్కుంటున్నారు. చదువుకున్నంత మాత్రాన స్త్రీలు తమ సమస్యలని పరిష్కరించుకోలేరు. చదువుతో పాటు వివేకమూ, దాని వెనుక హృదయ వైశాల్యమూ ఉండీ, ఈ మూడింటిని సమన్వయ పరచుకోగల ఆత్మవిశ్వాసం కూడా అలవరచుకోవాలి. అప్పుడే జీవితానికి పరిపూర్ణత లభిస్తుంది. నువ్వు చాలా జటిలమైన పరిస్థితులని ఎదుర్కున్నావు. కానీ వాటిని ఒంటరిగా ఏకాకిగా ఎదుర్కోలేదు. నీ పరిస్థితులని అర్థం చేసుకుని ఈమె నీకు అండగా నిలిచింది. అటువంటి సదవకాశం అందరికీ కలుగదు. నువ్వు ఎటువంటి సానుభూతి పొందావో, ఎటువంటి వాత్సల్యాన్ని పొందగలిగావో వాటిని నీ తోటివారికి, వాటి కోసం అర్రులు జాచేవారికి పంచిపెట్టు.' ఒక స్వామీజీ ఇచ్చిన సందేశం ఇది, 'ఆలోచించు' నవలలో! ఈ ఒక్క సందేశం చాలు, నేను మాలతీచందూర్ నవలల గురించి చెప్పాలనుకున్న పాయింట్లన్నీ ఇందులో నిబిడీకృతమై ఉన్నాయి. అవి - ఆవిడ చాలా మటుకు స్త్రీ పరంగా, స్త్రీ సమస్యల పరంగా రాశారు, ఆ సమస్యలలో ఎవరో ఒకరు సూచన ప్రాయంగా ఒక స్టేజిలో కొంత పరిష్కారం చూపిస్తారు, కానీ చాలా మటుకు ఆ స్త్రీయే ఒంటరిగా, ధైర్యంగా వాటిని ఎదుర్కొంటుంది, స్వామీజీ ఎలా విడమరచి

చెప్పారో అలా ఒక సమస్యని అన్ని కోణాలనుంచీ కూలంకషంగా అర్ధమయ్యేలా నచ్చచెపుతారు. చివరగా స్త్రీ జాతికి సందేశం ఉంది. ఇప్పుడు ఒకటొకటిగా చూద్దాం.

మాలతీ చందూర్ కథానాయికలు అన్ని వయసులకి, అన్ని వర్గాలకి చెందినవారు. చిన్న తనంలోనే విధవ, మాంచి యవ్వనంలోనే కాన్సర్‌కి గురి అయిన యువతి, ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త చిరు తిరుగుళ్ళని ఎదుర్కొన్న చదువుకున్న స్త్రీ, సంఘ సంస్కర్తగా విమర్శల నెదుర్కొన్న మహిళ, ఇలా రకరకాలుగా ఉంటారు.

ప్రతి దాంట్లో మొదట్లో ఎవరో ఒకరు అండగా నిలబడో, ధైర్యం చెప్పో, సలహా ఇచ్చో, మార్గదర్శకులవుతారు. విధవ అయిన స్త్రీకి ఆమె అన్నయ్య, భర్త నెదుర్కొనే ఆమెకు స్వామీజీ, పెళ్ళి విషయంలో తేల్చుకోలేని ఆమెకి సహ ఉద్యోగి, క్యాన్సర్ పేషెంటుకి ఆమెని ప్రేమించిన అతను, సంఘ సంస్కర్తకి భర్త, ఇలా ఎవరో కావాల్సిన వాళ్ళు చెపుతారు. అది మొదలు మాత్రమే.

రాను రాను వాళ్ళే ఎంతో పట్టుదలతో కృషితో పెంపొందించుకున్న ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగిపోతారు. ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా భయపడి పారిపోరు. ఎదురు నిలిచి ధైర్యంగా వాళ్ళకి వాళ్ళే పరిష్కరించుకుంటారు. 'అతను ప్రతిసారీ తనకు సాధ్యం కాని పనులు చెయ్యమంటున్నాడు. తనకి మించినవి చెయ్యమంటున్నాడు. తను భరించగలదా? భరించలేదు' అనుకున్నా కూడా అతని కోరిక తీరుస్తుంది లలిత.

కాన్సర్ పేషెంటు అయిన సంధ్య విధికి ఎదురీది పెళ్ళి చేసుకుని, పిల్లలని కనాలన్న పంతంతో కడుపుతో ఉంటుంది. ఆమెకి విపరీతంగా దురదలు పుడుతుంటాయి. గోక్కోకూడదు అని డాక్టరు చెబుతుంది. అది ఎలా ఎదుర్కొంటుందో చూడండి.

తల్లి కాబోతున్నానన్న ఉత్సాహం. ఆ కొత్త హోదా, సంధ్యని భూమ్మీద నిలవనివ్వటం లేదు. రాత్రిళ్ళు అయ్యేసరికి ఒంటి దురదలు నిలువనిచ్చేవి కావు. ఎంత సహించాలని ప్రయత్నించినా, ఒళ్ళంతా దూలగుంట ఆకు రాసినట్లు చిమ చిమలాడిపోతుండేది రాత్రిళ్ళు రెండు చేతులూ రుమాళ్ళతో కట్టుకునేది!

'దురదగా ఉంటే గోక్కో, ఫరవాలేదు. అంతేగానీ మొండి నిగ్రహం చూపకు' అన్నాడు అనంత.

'ఊహూ - గట్టిగా గీరుకుంటే పాపాయికి దెబ్బ తగలదా?'

ఈ సంధ్యే మొదట్లో కాన్సర్ వచ్చిందని కృంగిపోతే ఈ అనంత్ ఎలా విడమరచి చెప్పాడో, ఆ వాదనా పటిమ చూడండి.

'ఇన్ని ప్లస్‌పాయింట్స్ ఇచ్చినప్పుడు భగవంతుడిని ఇవన్నీ నాకెందుకిచ్చావ్ అని అడిగావా? ఒక్కసారి ఆలోచించి చూడు. ఇంత అందం ఇచ్చినప్పుడు దానికి నేను తగినదాన్ని అనుకున్నావ్. ఇంత ఎడ్యుకేషన్ ఇచ్చినప్పుడు నేను అర్హురాలిని, తెలివైన దానిని అనుకున్నావు. అందం తెలివి, చదువు, తల్లితండ్రుల ప్రేమ, ఆర్థిక సదుపాయాలు ఇవన్నీ నీకు ఉన్నప్పుడు ఇవి నాకెందుకిచ్చాడు. నాకే ఎందుకు ఇచ్చాడు అని దేముడిని ప్రశ్నించావా? పోనీ, నీలో నువ్వయినా ప్రశ్నించుకున్నావా?'

'ఇవి నాకు ఎవరూ ఎవ్వలేదు. నాకు స్వతహాగా వచ్చినవి నా జన్మతా వచ్చినవి.'

'అంటే ఇవేవీ భగవంతుడు ఇవ్వనప్పుడు, జబ్బు మటుకు దేముడు ఇచ్చాడని ఎందుకనుకుంటున్నావు? అందచందాలు, తెలివి తేటలు కలిగినప్పుడు అన్నీ నాకోసమే అని నా స్వంతం అనుకునే మనం, కష్టం దుఃఖం వచ్చినప్పుడు నాకే ఎందుకు రావాలి? అని బాధపడటం న్యాయమంటావా. ఒక్క సారి ఆలోచించి చూడు.'

భార్యాభర్తల మధ్య ఉండాల్సిన స్వీట్ నథింగ్స్ ఒకరికొకరమన్న భావన కూడా బాగా చొప్పిస్తారు. 'రాత్రిళ్ళు తామిద్దరూ కలిసి భోంచెయ్యటం తమకి అలవాటు. ఆ భోజనాల సమయాన్ని తామిద్దరూ, బెస్టు పార్టు ఆఫ్‌దిడే అని పిలుచుకునేవారు. ఒక్కోసారి చిన్న చిన్న విషయాలకి కోపం వచ్చినా ఆ కోపంతోనే పక్కపక్కన కూచుని భోంచేశారు.'

ఎన్ని సమస్యలున్నా, 'స్త్రీ కుంగిపోకుండా ఎలా ఎదుర్కోవాలో సందేశం ఉంది. 'నేనూ ఒకప్పుడు నీకు మల్లేనే చచ్చిపోదామనుకున్నాను. జీవితం శూన్యమనుకున్నాను. కానీ ప్రతి జీవితానికి ఒక రియాక్షన్ ఉంటుంది అని స్వామీజీ నాకు నేర్పారు. అదే నేను నీకు చెపుతున్నాను. నీ జీవితం అర్థవంతం చేసుకో.'

'నిన్ను చూస్తే ఆడపిల్లంటే ఇలా ఉండాలి పరిస్థితులని తనకు అనుకూలంగా ఎలా మలచుకోవాలో నీ దగ్గర నేర్చుకోవాలి' అని ఆవిడ అన్నట్టే జీవితం పూలపాన్పుకాదు. కష్టాలు వచ్చి తీరతాయి, వాటిని ఇలా ఎదుర్కోవాలి అని మనకి చెప్పకనే చెపుతున్నారు.

✡✡✡✡

## మనసులోని మనసు

\- మాలతీ చందూర్




'బాగా మగ్గిన మామిడి పండులాగా ఉంది ఆమె ముఖం. చెవులకి ధగ ధగ మంటున్న రవ్వల దుద్దులు. ఒక ముక్కుకి రవ్వల బేసరి, రెండో ముక్కుకి ఒంటిరాయి గుత్తి ముక్కుపుడక, రెండు చేతులకీ బంగారు గాజులు. మధ్య మధ్య పట్టు గాజులతో, ఇంచుమించు మోచేతులదాకా ఉన్నాయి గాజులు. మెళ్ళో ధగ ధగ మెరుస్తున్న అడ్డిగ, తోపురంగు పట్టు చీరె, జరీ కలిసిన పసుపురంగు అంచు, తోపు రంగుదే వదులుగా ఉన్న రవిక, తెల్లగా పండిన జుట్టు, చిన్నముడి, ఆ ముడి చుట్టూ జాజిపువ్వుల కత్తెర చెండు... స్థూలంగా చక్రాల కుర్చీ నిండుగా ఉంది.' జిల్లెళ్ళమూడి అమ్మ పోలికలు కలిగిన ఆమె పేరు సుందరమ్మ. ఎదుటివారి వ్యక్తిత్వాన్ని ఆమె భరించలేదు. ఆ ఇంట్లో ఆత్మగౌరవం ఉన్నవాళ్ళెవరూ ఉండలేరు.

చూడగానే చూపరులని ఆకట్టుకునే విగ్రహం ఆవిడ మనువడు రాజాది.

'నేను గ్రానీ మాట కాదనను. గ్రానీ ఏం చేసినా మన మంచికోరే చేస్తుంది. నేను గ్రానీని డిస్ప్లీజ్ చేసే పనులు ఏమీ చెయ్యను. అది నా ప్రిన్సిపల్, అని ఖచ్చితంగా చెపుతాడు.

'బొద్దుగా, తెల్లగా ఉన్న అతని కళ్ళలో పట్టుదల ఉంది. అతను మాట్లడుతుంటే ఆ కళ్ళు, ముఖకవళికలు బిగుసుకుని స్టిఫ్‌గా ఉండవు. మాటలతో పాటు రకరకాల భావాలు. మనిషిని చూస్తే అందగాడు అనిపించదు. కానీ నవ్వుతున్నప్పుడు, తమాషాగా, ఆకర్షణీయంగా కనిపిస్తాడు.' ఎప్పుడూ హుషారుగా, జోవియల్‌గా ఉండి, గలగల కబుర్లు చెప్పే ఇతని పేరు రాజారావు. సుందరమ్మగారికి యం.జి.మ్. అనీ, రాజాకి మమ్మలింగం అని పేర్లుపెట్టింది ఇతనే. అవును, ఆవిడకున్న ఆత్మబలం, విశ్వాసం వీళ్ళకెవళ్ళకూ లేదు. ఆఖరికి మా తాతగారికి కూడా. ఒక్క ఆడది అలా కుర్చీలో కూర్చుని విక్టోరియా మహారాణి లాగా మూడుతరాల మగవాళ్ళని గాడిదల్ని చేసిందంటే ఎడ్మిరేషన్ గాక మరేమిటి?' అంటాడు.

మెట్రో గోల్విన్ మేయర్ వారి (యం.జి.యమ్) పేరులోంచీ మూడుసార్లు ప్రేక్షకుల మీదికి గాండ్రుమని వచ్చిన సింహంలాగా, అందరినీ ఆడించే సుందరమ్మగారు గీచిన గీటు దాటననే రాజా, ఆవిడ మాటలు సీరియస్‌గా తీసుకోవటం నేనెప్పుడో మానేసాననే రాజారావు మధ్య నలిగి, జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్న అరుణ జీవితమే ఈ 'మనసులోని మనసు'.

ఆలిండియా రేడియోలో పనిచేస్తుంటుంది అరుణ. రోజూ రకరకాలుగా మారుతున్న సముద్రాన్ని తనివి తీరా చూడటం ఆమె హాబీ. 'మెత్తని తివాచీలా ఉంది దాని మీద నడిచి వెళ్ళిపోవచ్చునట్లుగా ఉంటుంది' అనుకుంటుంది. మధ్యాహ్నం వేళ చూసి. అరుణకి పొడుగాటి జుట్టు, ఎడం చెంప మీద బ్యూటీస్పాట్ పెట్టినట్టు పుట్టుమచ్చ ఉంటాయి. బాగా పాటలు పాడుతుంది. యమ్.ఏ పాసయింది. 'మా అరుణ కాఫీ తాగుతుంటే ధారపైకి కనబడుతుంది. అంత పల్చగా ఉంటుంది దాని మెడ' అని వాళ్ళమ్మ సావిత్రి

మురిసిపోతూ ఉంటుంది. అలాంటి అరుణని టీ.వీలో చూసి ముచ్చట పడి ఆవిడ మనుమడు రాజాకి ఖాయం చేస్తుంది. యం.జి.యమ్.లాంటి సుందరమ్మగారు. 'నాకు పిల్ల నచ్చింది. నేను అనుకున్న లక్షణాలన్నీ మా అరుణలో ఉన్నాయి. పెద్ద తలకట్టు ఉండాలని, చదువుకున్న ఆడపిల్ల కావాలని మీ తాతగారికి మహా కోరికగా ఉండేది.'

అరుణకి మొదటి కలయికలోనే ఆవిడ దాష్టీకం నచ్చదు. 'ఆవిడ మాటతప్ప ఇతరుల ఉద్దేశాలకి చెల్లుబాటూ ఉండదా?' అని కూడా అనుకుంటుంది. అయినా ఆ భయాలని అధిగమించి రాజా అందం, కారు, డబ్బు అరుణని అటుకేసి లాగుతాయి. ఆ కార్లో తామిద్దరు ప్రతి సాయంత్రం షికారుకెళ్ళచ్చు. కార్లో కొత్త ప్రదేశాలు చూడవచ్చు. అతని చేతిలో తన చెయ్యి అతని సరసన తను అతని భుజం మీద తన గడ్డం.. కోసుగా ఉన్న తన గడ్డం అతనికి గిలిగింతలు పెడుతుందా? తన పొడుగాటి జడతో ఆడుకునే అతని వేళ్ళు....'

కానీ అతను మొదటిసారి ఒంటరిగా బయటికి వెళ్ళినప్పుడే 'మా గ్రానీకి నచ్చితే - నాకు నచ్చినట్లే. అందుకే పెళ్ళిచూపులకి వచ్చాను. ఇదివరకు ఒకళ్ళిద్దరు అమ్మాయిలు నాకంటికి ఫరవాలేదనిపించింది. కానీ గ్రానీకి నచ్చలేదు. కాస్త నిరుత్సాహపడ్డాను. ఈ సారి నువ్వు అందరికీ నచ్చావు.' అంటాడు.

'మీ మామ్మగారికి ఇష్టం లేని పని మీరు చెయ్యరా?'

'ఇంతవరకూ చెయ్యలేదు, గ్రానిని హర్ట్ చెయ్యడం నాకు ఇష్టం ఉండదు.'

'ఇకముందు?'

'ముందు కూడాను. నాకు గ్రానీ అంటే చాలా ఇష్టం గ్రానీకి నేనంటే ప్రాణం.'

'నీ కోసం నేను అన్నీ వదలుకుంటాను' అనడం లేదు. అతని జీవితంలో గ్రానీ అతి ముఖ్యమైన వ్యక్తి. గ్రానీకి ప్రథం స్థానం - ఆ స్థానం తను క్రమక్రమంగా సంపాదించుకోవాలి అనుకుంటుంది. రాజా మీద మోజుతో ఉన్న అరుణకి ఇది పెద్ద ప్రాబ్లమ్‌గా అనిపించదు. 'చదువుకున్నవాడు, అందమైన వాడు, మంచి పొజిషన్‌లో ఉన్నవాడు భర్తగా లభిస్తే, ఏ ఆడపిల్ల వద్దంటుంది?' అనుకుంటుంది. అందుకే మధ్యమధ్యలో గ్రానీ, ఆవిడ... పెత్తనం గురించి భయాలున్నా వాటిని దూరంగా నెట్టి వేయడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. ఆవిడకి నచ్చజెప్పి రేడియో స్టేషన్ వాళ్ళతో భాస్కర్ చెల్లెలు పెళ్ళికి కోనసీమకి వెళుతుంది. అక్కడ కోనసీమ అందాలకూ, పెళ్ళివారి మర్యాదలకూ, పెళ్ళి కార్యక్రమాలకూ మురిసిపోతుంది.

అక్కడ పరిచయమవుతాడు రాజారావు. అతను సుందరమ్మగారు అరుణని వలచి, తన మనవడికి చేసుకుంటుందని విని 'ఆవిడకి నచ్చుతే చాలా? అసలైన వాళ్ళకి నచ్చక్కర్లేదా?'సూటిగా ప్రశ్నించాడు. 'గ్రానీ ఇష్టమే నా ఇష్టం అని బసవన్నలా తల ఊపక, మావాడు తన ఇష్టాఇష్టాలని పైకి చెపుతున్నాడంటే దార్లోపడ్డట్టే. వాడికి ఆ మాత్రం వ్యక్తిత్వం మీ వల్ల కలిగింది అంటే మిమ్మల్ని కంగ్రాట్యులేట్ చేయాల్సిందే -' అంటాడు. అక్కడితో ఊరుకోడు. 'మీకు విద్య ఉంది, అందం ఉంది, వయసు ఉంది, ఆరోగ్యం ఉంది, ఉద్యోగం ఉంది. సగటు ఆడపిల్లల కంటే మీరు ఎన్నో రెట్లు పైన ఉన్నారు. పెళ్ళి కాదనే భయంతో ముందుకు ఉరక్కండి' అని ఒక ఉచిత సలహా కూడా పారేస్తాడు.

'జీవితం, అందులోనూ స్త్రీ జీవితం చాలా సున్నితమయింది. భార్య భారాన్ని మొయ్యలేని భర్తతో ఆడది సుఖపడదు. తనకు తాను నిటారుగా నిలబడలేని మగవాడు భార్యను కాపాడుకోలేడు. అసమర్థుడైన మగవాడితో బ్రతికే ఒకరిని కంటే, ఖూనీకోరుతో బ్రతకటం నయం అంటూ ఉంటుంది. నాకు తెలిసిన ఒక స్త్రీ' అంటూ హడలగొడతాడు.

'మీకు కూడా చాలా పట్టుదల ఉందని తెలిసింది. ఇటువంటి పట్టుదల గలిగిన అమ్మాయి మామ్మ లింగం ఆకర్షణలో ఎలా పడింది? నిజంగా మామ్మ లింగం మీలో కదలిక కలిగించాడా? లేక ఆ ఇల్లూ, కార్లూ వీటికి భ్రమిశా అన్న సంశయం కలిగింది' అందుకే ఆలోచించుకోమని హెచ్చరిస్తాడు, వీళ్ళు పెళ్ళి నుంచీ వెళ్ళిపోతున్నప్పుడు రాజమండ్రిలో ట్రైను ఎక్కించేముందు.

అరుణకి విసుగ్గా కోపంగా ఉంది. తనలోని సంశయాలని, నీడలని ఈ వ్యక్తి మరీ పెద్దవి చేస్తున్నాడు. తన హృదయపు లోతుల్ని గుచ్చి గుచ్చి చాధిస్తున్నాడు అనుకుంటుంది. అతనితో రాజా తరఫున పోట్లాడుతుంది. కానీ అతన్నుంచీ విడిపోయాక తీరిగ్గా ట్రైనులో కూర్చుని ఆలోచిస్తే రాజాతో తన నిశ్చితార్థం రోజున కలిగిన నిరాశా, నిస్పృహా గుర్తొస్తాయి.

అరుణకి ఆరోజు ఏదో ప్రత్యేకమైన పని చెయ్యాలని ఉంది. అతని ఒడిలో తలపెట్టుకుని ఈ ఇసుకలో పడుకుంటే! తన వడిలో అతని తల ఆ జుట్టులోకి వేళ్ళు జునిపి ఎన్నో కబుర్లు చెప్పాలని ఉంది. ఎవ్వరూ లేకుండా ఈ సముద్ర తీరంలో ఈ సన్నని వెన్నెలలో తామిద్దరమే కూచోవాలి. అనంత జలరాసి కెదురుగా తామిద్దరం ఒకరిని ఆనుకుని ఒకరు కూచోవాలి.

కానీ గ్రానీ ఎదురుచూస్తుంటుంది వెళ్ళిపోవాలి అంటాడు రాజా. 'ఇతనికి ఎలా చెపితే అర్థం అవుతుంది. ఇది అన్ని రోజుల వంటిది కాదని! ఇది తమ జీవితాల్లో ముఖ్యమైన రోజు అన్నది అతనికి తెలియదా? అతనికి తనకున్న సెంటిమెంట్లు లేవా?' అనుకుంటుంది.

ఎవరూ లేని చోటికి వెళ్దామంటే, 'ఈ కార్లోమటుకు ఎవరున్నారు? మనం ఇద్దరమేగా?' అంటాడు.

కార్లో మూడోవ్యక్తి లేకపోవచ్చు. అతని మనసులో గ్రానీ ఉంది. ఇరవై నాలుగు గంటలూ ఆ గ్రానీ తమతోనే ఉంటుంది. ఆ గ్రానీ తలపు, ఆ గ్రానీ భయం లేకుండా అతను పూర్తిగా తనవాడు కావాలి.

'ఈ ఒక్క రాత్రి హాయిగా తిరుగుదాం. కారు లాక్‌చేసి అలా ఇసుకలో పరుగెడదాం?'

'ఇదేం సినిమా అనుకున్నావా, సిల్లీ, మనం ఇసుకలో పరుగులు పెట్టటమా? ఎవరన్నా చూస్తే నవ్వుతారు.'

'దేనికి? పరాయివాళ్ళం కాదు. ముసలివాళ్ళం కాదు. కాబోయే భార్యాభర్తలం!'

'అవుననుకో నువ్వు ఇలాంటి ప్రోగ్రామ్ ఉంది అంటే 'గ్రానీ'తో చెప్పి మరీ వచ్చేవాడిని.'

'ఏమని ఇసుకలో పరిగెడతామనా?'

అలా అరుణ కోరిక తీరనేలేదు. అసలే ద్వైదీభావంతో ఊగుతున్న అరుణకి, నాలుగు రోజుల ఎడబాటు తర్వాత కూడా రాజా అరుణ మీద ప్రేమ కురిపించడు. పెళ్ళి కబుర్లు అడగడు. అరుణ చెప్దామని చూసినా నిరాసక్తిగా ఉంటాడు. ఇతను మనిషి కాదా? ఇతని దేహంలో రక్తం పరుగులు పెట్టటం లేదా? ఒక స్త్రీ అందులోనూ కాబోయే భార్య పక్కన కూచుని ఉన్నప్పుడు, చెయ్యి కూడా స్పృశించని ఈ వ్యక్తిని నిగ్రహం కలవాడని పొంగిపోవాలా? నోటి మాటల్తోనయినా 'ఐమిస్‌యూ' అని ఎందుకు అనడు? అతని రెండు భుజాలు పట్టుకుని కుదిపి నువ్వు రాయివా? మనిషివా? అని అడగాలనిపిస్తుంది' అనుకుంటుంది అరుణ.

అలాటి మనిషితో పెళ్ళి ఇంకో వారంలో ఉందనగా అరుణ, రాజారావు పెళ్ళిలో ఒకళ్ళమీద ఒకళ్ళు వసంతం చల్లుకుంటున్న ఫోటోలెవరో సుందరమ్మగారికి పంపించారు. 'ఒక ఫోటోలో రాజారావు ఎడం చేత్తో తన గడ్డం పట్టుకుని కుడిచేత్తో బుక్కాపాముతున్నాడు. తను నవ్వుతూ చూస్తున్నది. ఇంకో ఫోటోలో తను చెంబు ఎత్తి వసంతం పోస్తున్నది. అతను రెండు చేతులూ అడ్డుపెట్టి వద్దని అర్థిస్తున్నాడు.' అవి చూసి అగ్గిమీద గుగ్గిలమే అయింది సుందరమ్మగారు.

'నా గురించి అడుగుతున్నప్పుడు యమ్.జి.యమ్. ముఖకవళికలు ఎలా మారతాయో చూడటానికైనా రావాలని ఉంది. టిక్కెట్ కొనుక్కుని మీతోరానా?' అన్న అతని మాటలు అక్షరాలా నిజమని నిరూపిస్తోందావిడ. 'ఇంతకీ మీరెవరు, ఆ ఇంట్లో అందరి గురించి ఇంత వివరంగా చెప్పుతున్నారు?' అని అరుణ ఎన్నిసార్లు గుచ్చి గుచ్చి అడిగినా చెప్పడు. రాజా పేరుతో అతని పేరు కలిసినా అరుణకి బుర్ర పనిచేయదు. ఇంతకీ అతనెవరో కాదు ఆవిడకి అక్షరాలా స్వంత మనవడే రాజా తండ్రి మొదటి భార్య కొడుకు. ఈవిడ ఆవిడిని, కొడుకుని వెళ్ళగొట్టేసి కొడుక్కి రెండో పెళ్ళి చేసింది. ఆ భార్యకి పుట్టినవాడు రాజా. ఈవిడ తోక తెగిన త్రాచులా, వీధిలో అలగా వాళ్ళలా అరుస్తుంటే రాజా శిలలా నిలుచుండిపోతాడు.

అంతకు ముందు ఏదో సందర్భంలో అరుణ, 'మీరు నా తరుపున చెప్పకూడదా' అంటే చెప్పను. ఈ విషయాల్లో కలిపించుకోను. మీరుమీరు చూసుకోండి. గ్రానీకి నువ్వు చెప్పుకో!' అంటాడు. అప్పుడు అంతగా సురుక్కుమనదు అరుణకి. కానీ ఇప్పుడు ఇంత క్లిష్ట పరిస్థితిలో కూడా అలాగే ఉంటే, 'కాబోయే మొగుడు, నన్ను ఇన్ని మాటలంటూంటే విగ్రహంలాగా కూర్చున్నాడు. ఇలాంటి చవట నాకు మొగుడు కాకపోయినా ఫర్వాలేదు. నేను మీ మనవడిని పెళ్ళి చేసుకోను. నాకీ పెళ్ళివద్దు. మీ సంపదా వద్దు. పద నాన్నా పోదాం' అని లేచి చక్కా వచ్చేస్తుంది.

అయినా రాజా కోసం సమాధానం పడదాం, అతనేం సమాధానం చెప్తాడో విందామని అతనితో విడిగా మాట్లాడదామని ఫోను చేసి పిలుస్తుంది. 'నువ్వు ఫోన్ చెయ్యగానే గ్రానీతో చెప్పాను. తప్పకుండా వెళ్ళి తీసుకురమ్మంది' అనేసరికి అరుణకి కారు బోనెట్ కేసి తన తల బద్దలు కొట్టుకోవాలని అనిపిస్తుంది. అతని తల నుగ్గు నుగ్గు అయ్యేదాకా బంపర్ కేసి బాదాలనిపిస్తుంది. అంతే. ఆ సంబంధం తెగతెంపులు చేసుకుంటుంది. అదే ముహూర్తానికి తన చెల్లెల్నిచ్చి రాజాతో పెళ్ళి చేసేస్తారు.

అరుణ అమ్మమ్మగారితో పోట్లాడుతున్నప్పుడు 'ఆ రాజా రావుగారికి నేనంటే ఇష్టం. నన్ను ప్రేమించానని అన్నారు. మీ మనమడి మీద జాలిపడి, అతని ప్రేమకాదన్నాను. ఇప్పుడు వెంటనే రాసేస్తాను. వచ్చి నన్ను పెళ్ళి చేసుకోమని' అంటుంది. అలాగే వెంటనే రాసేస్తుంది కూడా, పెళ్ళిచేసుకోమని కాదు, పెళ్ళి చెడగొట్టినందుకు అతన్ని చాలా అవమానపరుస్తూ! రాజారావుకి అరుణంటే ప్రేమ ఉన్నమాట నిజమే, కానీ పెళ్ళి చెడగొట్టే స్వభావం ఎంత మాత్రం లేదని అతన్ని తెలిసిన వాళ్ళందరూ ఘంటా భజాయించి మరీ చెపుతారు.

రాజారావు అరుణని చూసిన మొదటి క్షణంలోనే ఆ అమ్మాయి అంటే ఇష్టపడతాడు. 'ఈ అమ్మాయి తనకెందుకు తటస్థ పడాలి? తన నెందుకు సూదంటు రాయిలా ఆకర్షించాలి? ఈ ఆకర్షణనుంచీ తాను ఎలా తప్పుకోవాలి' అనుకుంటాడు.

'మీరు కూడా అంటే నేనో ప్రత్యేకమైన దాన్నా?' అన్న అరుణ ప్రశ్నకు 'నాకంటికి మీరు ప్రత్యేకంగా కనిపిస్తున్నారు. మీరు రాజాకి కాబోయే భార్య కాకపోయినట్లయితే నా కంటికి ఎలా కనిపిస్తున్నారో, రోజులు రోజులు వర్ణించి చెప్పే వాడిని' అంటాడు. అరుణకి చెప్పలేక, తల్లికి గంటలు, గంటలు వర్ణించి చెప్తాడు.

'ఆ అమ్మాయి చాలా బాగుంటుందా?'

'రూపం కాదు. ఆ అమ్మాయి మాట్లాడే తీరు, కోపం వచ్చినప్పుడూ ఎదిరించి దెబ్బలాడే తీరు తమాషాగా ఉంటుంది. ఆ రాజాగాడిని నేను ఏదో అనేస్తున్నానని ఆడపులిలా నా మీదకి దూకింది. అరుణ చదువుకుంది. చలాకీగా ఉంటుంది.'

అంతేకాదు వాళ్ళిద్దరి భావాలూ, ఆలోచనలూ ఒకటే. అరుణకి ఒక శుభలేఖ అంటే చాలా ఇష్టం. పసుపూ ఎరుపూ కలిసిన రంగుల కలయిక మీద సన్నని మంగళసూత్రాలూ, మట్టెలూ ఈ రెండే బొమ్మలు. ఇన్విటేషన్‌కి కుడిచేతివైపు పైన చంద్రుడూ, నక్షత్రాలు - ఆ చంద్రుని బింబంలో కనీ కనబడనట్లు చిరునవ్వు - చంద్ర బింబం నుంచీ పూలురాలుతున్నాయి ఈ తాళిబొట్టు మీద మాంగల్యం, పసుపూ, కుంకుమ, వెన్నెల, పూలజల్లు ఇవన్నీ వైవాహిక జీవితానికి పరిపూర్ణత కలిగించేవి. వీటన్నిటినీ ఆ ఒక్క ఇన్విటేషన్‌లో పొందుపరిచాడు ఆర్టిస్టు అనుకుంటుంది. కానీ రాజాకి నోరు లేదు, గ్రానీకి టేస్ట్ లేదు. అందుకని చెప్పలేదు. రాజారావుతో ఏదో మాటల్లో మొదలెడితే ఆ వివరాలు అతను పూర్తిచేసి అవును నేను చూశాను చాలా బాగుంది అంటాడు.

అలాగే అరుణకి సముద్రం అంటే చాలా ఇష్టం. 'మిట్టమధ్యాహ్నం, మూడుగంటల వేళప్పుడు మీరు సముద్రం ఎప్పుడూ చూడలేదు కదూ! నీలపు తివాచీ పరిచినట్లు ఒకసారి పాలసముద్రంలాగా నురుగలు కక్కుతూ ఉంతుంది. ఆ సముద్రపు మూడ్స్ చూస్తూ కూచోటం నాకు చాలా సరదా. అది మీకు కూడా చూపించాలని...'

‘ఎండలో, వర్షంలో, వెన్నెలలో, చీకట్లో, అన్నింట్లో ఒక అందం ఉంది, వాటిని చూడగలిగిన నెచ్చెలి పక్కన ఉన్నప్పుడు! నేను వైజాగ్‌లో ఉన్నప్పుడు, సముద్రపు ఒడ్డున తెగ తిరుగుతుండేవాడిని. మా ఫ్రెండ్స్ అంతా నన్ను సీగల్ అనిపిలిచేవారు‘ అంటాడు.

అంతేకాదు ‘అరుణా, ఆ రోజు రాజమండ్రి స్టేషన్‌లో నిన్ను రైలెక్కించాక, నాకు ఎక్కడికైనా పారిపోవాలనిపించింది. పరుగెడుతున్న ఆ రైల్లోంచి నిన్ను రెక్కపట్టుకుని కిందకి లాగాలనిపించింది. మరో క్షణంలో ఏ రామకృష్ణా మిషన్‌లోనన్నా చేరిపోదామనిపించింది. ఇన్ని భావాల కెరటాలతో ఇంటికెళ్ళిపడుకున్నాను‘ అంటాడు.

కొన్ని సంఘటనల తర్వాత వాళ్ళు పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకుని, పెద్దలొప్పుకున్నాక అరుణ అడుగుతుంది, ‘ఆర్ యూ హ్యాపీ‘ అని, ‘మై హాపీనెస్ యిజ్ హియర్‘ అంటూ అరుణ చేతిలో అతను తన వేలితో రాసి చూపిస్తాడు. తన హాపీనెస్‌లో అలాగని హాపీనెస్ ఇమిడి ఉందిట అని మురిసిపోతుంది అరుణ. ఇదే ప్రశ్నకి రాజా ‘యస్‘ అన్నాడే కానీ ‘నీ సంగతి ఏమిటి?‘ అనలేదు, రాజారావులాగా అనుకుంటుంది.

అమ్మమ్మగారిలాగా హెచ్చులకి పోదామన్న ఉద్దేశంతో, బజారుకి వెళ్ళి పట్టుచీరలు కొందామని అరుణ తల్లి అంటే అరుణ తరపున రాజారావు హామీ ఇచ్చేస్తాడు.

‘నేను రాను అంటే ఏం చేస్తారు?‘ అంటుంది.

‘ఆ కాళ్ళపారాణి నా ముఖం మీదకొస్తే నీకే అవమానం. పెళ్ళికి ముందే మొగుడు చేత కాళ్ళు పట్టుకు బ్రతిమాలించుకుంది అని నలుగురూ అనుకుంటారు. నువ్వెన్ని చెప్పినా నా ముఖానికి అంటిన నీ పారాణి కడుక్కోను. టాక్సీ కట్టించుకు వెళ్ళి భాస్కర్‌కీ, రమోలాకీ చూపించివస్తాను. అప్పుడు ఆలిండియా రేడియో అయిపోతుంది నీ పని..‘ అంటాడతను నవ్వుతూ.

‘స్వీట్ నథింగ్స్‘ అంటే ఇలా ఉంటాయా? ఇతని కబుర్లు ఎంతసేపు విన్నా విసుగనిపించవు. ఇంకా వినాలని అనిపిస్తుంది. పెళ్ళయ్యాక ఇద్దరూ హానిమూన్‌కి బెంగుళూరు, మైసూర్ వెళతారు. అరుణ ఒకరోజు కాలి వేళ్ళ నుంచీ మెట్టెలు తియ్యబోతుంది. రావు. ‘ఈ వేళ్ళనుంచీ ఈ చుట్లు రావడం లేదు, చుట్ల కింద నీళ్ళు ఇరుక్కుని దురదగా ఉన్నాయి‘ అంటే అతను నిశ్శబ్దంగా కోల్డ్‌క్రీమ్ తీసుకొచ్చి రెండు వేళ్ళకి పట్టించి చుట్లు తీసేస్తాడు. ఆ రెండు వేళ్ళకూ క్రీం పట్టించి రుద్దుతాడు.

‘అరుణ పడుకుంది. ఈ దృశ్యం చూస్తే ఎవరన్నా ఏమనుకుంటారు? తమది అన్యోన్య దాంపత్యమనుకుంటారు. భర్త చేత కాళ్ళు పట్టించుకుందనుకుంటారు. అతను తన పాద దాసుడనుకుంటారు. తమది అన్యోన్య దాంపత్యమా? అరుణకి తెరలు తెరలుగా నవ్వొస్తున్నది‘ ఎందుకంటే వాళ్ళు పెళ్ళి చేసుకుంటారే కానీ వాళ్ళ మధ్య బంధం ఉండకూదంటాడు రాజారావు ముందే ఆ ఫోటోలు చూసిన ఆవేశంలో రాసిన అరుణ ఉత్తరంలో అతన్ని నికృష్టుడూ, సంస్కారహీనుడూ, బ్లాక్‌మెయిలర్ అని కోపంగా ఏకిపారేస్తుంది. దీన్ని ఫ్రేమ్ కట్టించుకుని హాల్లో వేళ్ళాడదీసుకోండి అంటుంది కూడా. అరుణ కాలక్రమేణా మర్చిపోయినా ఆ ఉత్తరం రాజారావు ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తుంది. ఆ ఫోటోలు పంపిన అసలు వ్యక్తి బయటపడేదాకా కాకినాడ తీసుకెళ్ళననీ, తను మద్రాసులోనే ఉండి ఉద్యోగం చేయాలని షరతు కూడా పెడతాడు.

‘మద్రాసులోనే ఇంకా ఎందుకు ఉంది? ఇక్కడ ఆవిడకి ఏం ఆకర్షణలున్నాయో‘ అంటుంది అమ్మమ్మగారు. ‘మీ కళ్ళు చల్లబడ్డాయా? ఆవిడ ఎట్లా అందో చూశారా? నాకు ఈ ఊళ్ళో ఆకర్షణలున్నాయట. అంత మాట అంటుంటే మీకు రోషం రాలేదా? మీ వంట్లో చీమూ, నెత్తురూ...‘

‘ఆ షాపు ఆవిడ మాటలు సీరియస్‌గా తీసుకోవటం నేనెప్పుడో మానేశాను. ‘

‘అసలు మీ ఇంట్లో మొగాళ్ళకి చేవలేదు. పెళ్ళాన్ని ఆ మాట అంటుంటే వింటూ ఊరుకున్నారు. మీరు ఆ రాజాకంటే ఏవిధంగా తీసిపోయారు?‘ శక్తిలా పడుతోంది అరుణ. ‘మనిద్దరి మధ్యా భార్యాభర్తల అనుబంధమే కాదు, మీరనుకునే సోకాల్డ్ స్నేహం కూడా

లేదు. ఈనాటితో అదికూడా తెగిపోయింది' అంటుంది వెక్కి వెక్కి ఏడుస్తూ. కథ మళ్ళీ మొదటికొస్తుంది. అదే అవమానం, అదేమౌనం. రాజా జీవితం నుంచీ ఎలా పారిపోతుందో, రాజారావు జీవితం నుంచీ కూడా అలాగే పారిపోతుంది. కాకపోతే రాజాలా చేతులు ముడుచుకు కూచోకుండా, తీర్థయాత్రలకి బయలుదేరిన అరుణని ఢిల్లీలో వలేసి పట్టుకుని వెనక్కి తీసుకువస్తాడు. వాళ్ళ మధ్య మనస్పర్ధలు విడితాయి. ఆ ఫోటో రాజారావు తల్లి, అతను అరుణ కోసం పడే బాధ చూడలేక ఏదో తెలీని ఆవేశంలో పంపానని వివరంగా ఉత్తరం రాస్తుంది.

అరుణ, పెళ్ళంటే ఎలాంటి కలలు కంటుందో అవి అప్పుడు, ఆలశ్యంగా, తీరతాయి. 'తన జడతో అతను ఆడుకుంటాడు. పొడవాటి తన వెంట్రుకలతో అతని చుట్టూ ప్రేమ తెరలు కడుతుంది. ఆ తెరలని చీల్చుకుని లోనికి ఎవరినీ రానివ్వదు. అతను తనవాడైనప్పుడు, తన ప్రేమలో బందీ అయినప్పుడు బయట ప్రపంచంతో పనిలేదు అనుకుంటుంది రాజా గురించి. కానీ అలా రాజారావు ఆడుకుంటాడు, మబ్బులు విడిపోయాక అరుణ పొడవాటి వెంట్రుకలు చిక్కుతీస్తూ... మధ్య మధ్య తన మెడకి చుట్టుకుని ఆడుకుంటూ కబుర్లు చెపుతున్నాడు. పట్టుదల, కోపం, ప్రేమ, అభిమానం ఈ అన్నిటి కలయికే ఈ అరుణ. తన జీవితాన్ని, పైకి కనబడని బంధాలతో చుట్టి వేస్తున్నది. ఫానుగాలికి పొడుగాటి వెంట్రుకలు అల్లల్లాడుతున్నాయి. అతని ఒడిలో ఉన్న ఆ పొడవాటి తలకట్టుని చేతికి చుట్టుకుంటున్నాడు.'

✡✡✡

*పెళ్ళితో ఆడపిల్లకు స్వేచ్ఛపోతుంది అంటారు. తనకి స్వేచ్ఛ కావాలని అనిపించటంలేదు.. తనకి అదృష్టం కొద్దీ రాజా లభించాడు. అతని కోసం తను ఏదైనా చేస్తుంది.*

*ఈ ఇద్దరు యువకులూ తనని ప్రేమించిన వారే. తనకంటే మక్కువ పడిన వాళ్ళే ఒక వ్యక్తిని తను తిరస్కరించింది. మరొకతను తనని తిరస్కరించాడు. ఇద్దరి వల్లా తనకి అశాంతి, కన్నీరే తప్ప సుఖం లేదు. ఈ ఇద్దరూ తన ప్రమేయం లేకుండా తన జీవితంలో ప్రవేశించారు. చెరో విధంగా తనని కన్నీటి పాలు చేసారు.*